ఈ-పేపర్ తెలుగు డైలీ | 8PM

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

బుధవారం, జులై 29, 2026

అంబర్‌పేటల ఖతర్నాక్ వాన..

ట్రాఫిక్ జామ్‌తో జనాలు బేజార్!

ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూలై 28:

గ్రేటర్ హైదరాబాద్ ల వాన దంచికొట్టింది. కరెక్ట్‌గా ఆఫీసులు ఇండ్లకు పోయే టైంల కుండపోత పడటంతో జనాలు ఘోరంగా తిప్పలు పడ్డారు. అంబర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, ఎల్బీ నగర్, సికింద్రాబాద్ అని తేడా లేకుండా గ్రేటర్ వ్యాప్తంగా రోడ్లన్నీ చెరువులను తలపించాయి. వర్షపు నీళ్లతో ప్రధాన అధికారులు జలమయం కావడంతో వాహనాలు గంటల తరబడి నిలిచిపోయి ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పరిస్థితిని చక్కదిద్దడానికి హైడ్రా, డీఆర్ఎఫ్, జీహెచ్‌ఎంసి బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు

నేను పారిపోలేదు.. ఊళ్లోనే ఉన్నా: ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

2

ఫేస్‌బుక్‌లో మోదీ వీడియో తొలగింపు.. సారీ చెప్పిన మెటా

2

యాంటీ-పేపర్ లీక్ బిల్లు భారత పార్లమెంట్ చరిత్ర నిలిచిపోతుంది: జితేంద్ర సింగ్

2

ఇంత కరువు పట్టి ఉన్నారేంట్రా.. స్థంభాలకున్న కరెంట్ తీగలనూ వదల్లేదు..

3

పచ్చటి సంసారాలు సత్తెనాష్..!

- పెండ్లాల లవ్ ఎపేర్స్.. పతిదేవుల్ల కిస్సా ఖతం..!
- క్రైమ్ థ్రిల్లర్ సీన్లు.. కుక్కర్లలో మొగుళ్ల ముక్కలు!
- బాత్‌రూమ్‌లల్లో సమాధులు.. టైల్స్ వెనుక ఘోర నిజాన్ని దాచే కుట్రలు!
- అయ్య కాటి పాలు..అమ్మ జైలు పాలు.. పిల్లలు రోడ్డు పాలు..
- నెట్ చాటింగ్‌లతో లవ్వు.. కాపురం మొత్తం బొగ్గు!
- సోషల్ మీడియా చస్కా.. ఆర్నెళ్లలో 554 మంది ఫినిష్!
- నచ్చకపోతే తప్పుకో.. ప్రాణాలు తీసి జైలుకెళ్లకో!
- పతిదేవుళ్లు జర హుషార్.. కన్నేసి ఉంచకపోతే అయితది ఘోర్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 28:

ఏంది భాయ్ జమానా ఇట్లా తయారైంది..ఒకప్పుడు పెండ్లి అంటే 'ఏడేడు జన్మల బంధం'. కానీ ఇప్పుడు సీన్ మొత్తం రివర్స్ అయిపోయింది. కష్టపడి సంపాదించే భర్త.. ఇంట్లో ఉన్న పెళ్లానికి, ఆమె సీక్రెట్ లవర్‌కి అడ్డొస్తున్నాడని సీదా 'టికెట్' ఇచ్చేస్తున్నారు. ఇటీవల గురుగ్రామ్‌కు చెందిన 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' ఇచ్చిన తాజా రిపోర్ట్ చూస్తే దిమాక్ ఖరాబ్ అవ్వాల్సిందే!

రోజూ ఇద్దరు భర్తలు అవుట్.. క్రైమ్ థ్రిల్లర్ సిన్మాలను మించిన సీన్లు!

2026 తొలి ఆరు నెలల్లోనే ఏకంగా 554 మంది భర్తలు ప్రాణాలు కోల్పోయారు. అందులో 322 మంది హత్యకు గురవ్వగా , 232 మంది వేధింపులు తట్టుకోలేక సూసైడ్ చేసుకున్నారు.హత్యలకు గురైన 322 మందిలో 194 మంది (60.2%) భార్యల అక్రమ సంబంధాల వల్లనే శవాలుగా మారారు. షాకింగ్ మేటర్ ఏందంటే.. చంపే పద్ధతులు చూస్తే కిరాతకం అనడానికి కూడా మాటలు చాలవు. క్రైమ్ సినిమాలు చూసి ప్లాన్లు వేస్తున్నారో ఏమో గానీ, భయం అనేది అసలే లేకుండా పోయింది..ఒక కేసులో భర్తను ముక్కలు చేసి ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించింది.కొక కేసులో మొగుడిని చంపి, బాత్‌రూమ్‌లోనే పాతిపెట్టి పైన మస్తు టైల్స్ వేసింది. తలలు నరకడం, బాడీని పీస్‌లు చేయడం, విషం పెట్టడం, లైవ్‌లో కాల్చేయడం, లేదా సీన్ ఆక్సిడెంట్ సూసైడ్ లాగా క్రియేట్ చేయడం.. అబ్బో ఒకటా రెండా, మస్తు ఖతర్నాక్ ప్లాన్‌లు వేస్తూ..ఇలా దారుణంగా రకరకాల స్టైల్లో ఖతం చేస్తున్నారు.

ఏడ నడుస్తోంది ఈ క్రైమ్ జాతర?

ఈ అక్రమ సంబంధాల భయానక్ సీన్స్ లో ఉత్తర టాప్‌లో ఉంది.

అక్కడ ఏకంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలు అయ్యాయి. మన తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటకలల్ల కూడా ఈ కాండ్ల సంఖ్య గట్టిగానే ఉంది.

సోషల్ మీడియా మస్కా.. పిల్లల జిందగీ ఖల్లాస్ !

సోషల్ మీడియా పరిచయాలు, లగ్జరీ లైఫ్ పిచ్చి, కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఈ అక్రమ సంబంధాలు పెరుగుతున్నాయట.

తల్లి జైలుకి, తండ్రి సమాధికి పోవడంతో అమాయక పిల్లలు రోడ్డున పడి అనాథలవుతున్నారు. ఆఖరి బాత్ ఏందంటే నచ్చకపోతే లీగల్‌గా విడాకులు తీస్కొని పక్కకు జరగాలె.. అంతేగానీ ప్రాణాలు తీసి జైలుకెళ్లడం ఏంది? పతిదేవుళ్లు కూడా జర జాగ్రత్తగా, హుషార్‌గా ఉండండి!

ఢిల్లీని చుట్టుముట్టిన 'టీడబ్ల్యూజేఎఫ్' నేతలు..

'మా పంచాయితీ తెంపాలి' అని మంత్రులకు వినతులు..!

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 28: జర్నలిస్టుల సమస్యల గురించి చెప్పుకోవాలె అని సదురు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ లీడర్లు సీరియస్‌గా తీసుకొని ఏకంగా ఢిల్లీ బాట పట్టారు. జంతర్ మంతర్ దగ్గర మొన్న సోమవారం గట్టిగా ధర్నా చేసి, ఆ తర్వాత మంగళవారం కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా పలువురు ఎంపీలను కలిసి వినతిపత్రాలు చేతిలో పెట్టారు.. కరోనా టైంలో బంద్ చేసిన రైలు రాయితీ పాస్‌లను మళ్లీ మొదలుపెట్టాలె.రిటైర్డ్ జర్నలిస్టులందరికీ నేషనల్ పెన్షన్ స్కీమ్ కింద నెలకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలె. పనిచేసే దగ్గర రక్షణ కోసం పార్లమెంట్‌లో ప్రత్యేకంగా ఒక గట్టి చట్టం తేవాలె. సుప్రీంకోర్టు తీర్పును మళ్లీ సమీక్షించి జర్నలిస్టులకు, సొసైటీలకు ఇండ్ల స్థలాలు దక్కేలా చూడాలని లీడర్లు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్, బండి విజయ్ కుమార్, కుంచం శ్రీనివాస్ కోరారు.

'మా పవర్‌ను ఎవరూ గుంజుకోలేరు!'..

హైడ్రా రంగనాథ్ పంచాయితీపై రేవంతన్న గర్జన!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 28:

"ఏ ఆఫీసర్‌ను ఎక్కడ కూర్చోబెట్టాలె అనేది పూర్తిగా ప్రభుత్వ ఇష్టం.. ఈ విచక్షణాధికారాన్ని ఎవడూ గుంజుకోలేడు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగా తేల్చిజెప్పారు. కోర్టు ధిక్కారణ కేసుల ముచ్చటపై ఢిల్లీల స్పందించిన ఆయన, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు మద్దతుగా నిలిచారు. గతంలో సోమేశ్ కుమార్‌పై 400 కేసులున్నా నడవలేదా అని ప్రశ్నించారు. తప్పుడు కేసులను కోర్టుల్లోనే చూసుకుంటామని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం తెచ్చిన హైడ్రా ఒక తోప్ సంస్కరణ అని, దేశమంతా దీనికి జై కొడుతుంటే బీఆర్ఎస్ లీడర్లు, కబ్జారాయుళ్లకు మాత్రమే కడుపుమంటగా ఉందని మండిపడ్డారు. హైడ్రాను తీసేదే లేదని, దాన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

సర్కారు జాగాలను ఆక్రమిస్తే పేదోళ్లయినా, బడా బాబులైనా ఊరుకునే ప్రసక్తే లేదని, బుల్డోజర్లు దింపుతామని వార్నింగ్ ఇచ్చారు.

"హైడ్రా తొమ్మిది తలల విషనాగు.. రేవంత్ రెడ్డి పెద్ద దందా" : కేటీఆర్

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 28: హైడ్రా వెంటనే హైకోర్టు చీఫ్‌గా రంగనాథ్‌ను తీసెయ్యాలని గట్టిగా చెప్పడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద విమర్శలతో విరుచుకుపడ్డారు. మంగళవారం ఢిల్లీల మీడియాతో మాట్లాడుతూ..ఈ తీర్పు రేవంత్ రెడ్డికి కోలుకోలేని చెంపపెట్టు అని అన్నారు. కోర్టు చెప్పినట్టే హైడ్రా అనేది తొమ్మిది తలల విషనాగు అని రేవంత్ స్కీమ్ వెనుక పెద్ద స్కామే దాగుందని, హైడ్రా పేరు బెదిరించారని అన్నారు. అలా వసూలు చేసిన మూటలను గాంధీకి, ఇటు ఢిల్లీ బీజేపీ పెద్దలకు పంపాలని, ఈ దందాలో ఇక్కడి బీజేపీ నేతలు కూడా రేవంత్‌కు ఫుల్ సపోర్ట్ ఇస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

కేంద్రంపై రేవంతన్న ఫైర్.. 'విద్యపై ఆధిపత్యం నడవదు, ఇండ్ల పంచాయితీ తేల్చాల్సిందే!'

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 28: ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై, గత బీఆర్ఎస్ పాలనపై పక్కా తెలంగాణ యాసలో విరుచుకుపడ్డారు. ఆఫ్‌లైన్ పరీక్షల వల్లనే రచ్చ ఎక్కువవుతోందని, తప్పు చేసినోళ్లను తొక్కిపట్టాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో రాష్ట్రాల అధికారాలను గుంజుకోవాలని కేంద్రం చూస్తోందని, యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయిస్తే ఒప్పుకునేది లేదని తెగేసి చెప్పారు.విద్య అనేది రాష్ట్ర పరిధిలోనే ఉంటే తప్పులు జరగవు. కేంద్రం అనవసరంగా జోక్యం చేసుకోవద్దన్నాడు. ఇక..కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయిన రేవంత్ రెడ్డి వీబీజీ రామ్-జీ స్కీమ్‌లో రైతుల బాగు కోసం కూరగాయల పందిళ్లు, పట్టు పురుగుల పెంపకం షెడ్ల లాంటి 10 కొత్త పనులను చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణల రాబోయేది మన డబుల్ ఇంజిన్ సర్కారే.. రాంచెందర్ రావు

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 28:రాబోయే రోజుల్లో తెలంగాణల బీజేపీ 'డబుల్ ఇంజిన్ సర్కార్' రావడం పక్కా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు గట్టిగా చెప్పారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన కార్యకర్తల మీటింగ్‌ల ఆయన మాట్లాడుతూ.. "దక్షిణ తెలంగాణల బీజేపీ గట్టిగా బలపడుతోంది, చదువుకున్న యూత్ పెద్ద సంఖ్యల పార్టీలు చేరుతుండటమే దానికి నిదర్శనం" అని అన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్న ఆయన.. యువజన ఉద్యమాల పేరుతో విదేశీ పైసలు తెచ్చి దేశాన్ని విడగొట్టే కుట్రలు జరుగుతున్నాయని, ప్రజలంతా ఒక దేశ సమగ్రతను కాపాడుకోవాలని అన్నారు.

కాచిగూడల ఘోర ప్రమాదం

ఆర్టీసీ బస్సు కింద పడి మహిళ స్పాట్‌లోనే బలి!

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 28:

కాచిగూడల దారుణమైన రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీని ఓవర్‌టేక్ చెయ్యాలని చూసిన ఒక మహిళ స్కూటీ అదుపుతప్పి పక్కనే ఉన్న బస్సు కిందపడింది. ఈ ఘోర ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందగానే కాచిగూడ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించి, కేసు నమోదు చేసి అసలేం జరిగిందనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ కార్డుదారులకు బంపర్ ఆఫర్

ఒకేసారి 3 నెలల బియ్యం ఉచితం!

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కేక పెట్టే వార్త .. వచ్చే నెల ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇచ్చేందుకు రెడీ అయ్యింది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గోదాముల నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలించడం, ఈ-పాస్ మిషన్లను సిద్ధం చేయడంపై ఫుల్ ఫోకస్ పెట్టారు. మరోవైపు మూడు బియ్యాన్ని స్టాక్ పెట్టేందుకు నెలల రేషన్ డీలర్లు కూడా షాపుల్లో జాగ సర్దుతున్నారు.

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

జనరల్ న్యూస్

బుధవారం, జులై 29, 2026

02

స్వల్ప నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

24,000 దిగువకు నిఫ్టీ

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 28:

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఆసియా మార్కెట్లలో బలహీన ధోరణి, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంకులు, కెమికల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. అయితే ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు నష్టాలను కొంత మేర తగ్గించాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 69.86 పాయింట్లు తగ్గి 76,765.92 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 10.60 పాయింట్లు క్షీణించి 23,985.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హిందుస్థాన్ యూనిలీవర్, భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్), కోల్ ఇండియా షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. మరోవైపు ఐటీ షేర్లు మంచి ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ ఐటీ సూచీ 3 శాతానికి పైగా ఎగసి వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిసింది.

తెలంగాణ ఏసీబీ దూకుడు..

రికార్డ్ స్థాయిలో కేసుల నమోదు

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 28:

అవినీతిపై తెలంగాణ ఏసీబీ ఉక్కుపాదం మోపుతుందని, అవినీతిపై రాజీ లేకుండా చర్యలు కొనసాగిస్తామని ఏసీబీ డీజీ చారు సిన్హా స్పష్టం చేశారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30, 2026 వరకూ తెలంగాణ ఏసీబీ మొత్తం 10 ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులు, 34 ట్రాప్ కేసులు, 23 ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డు స్థాయిలో కేసులు నమోదు చేసింది. 1983లో ఏసీబీ ప్రారంభమైన తర్వాత ఒకే త్రైమాసికంలో ఇంత భారీ స్థాయిలో కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో ఏసీబీ డీజీ చారు సిన్హా ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి, నమోదైన కేసులు, ట్రాప్ ఆపరేషన్లు, దర్యాప్తు పురోగతి, నిందితులపై తీసుకుంటున్న చర్యలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా డీజీ చారు సిన్హా మాట్లాడుతూ..'అధికారుల సమష్టి కృషి, నిబద్ధత వల్లే ఈ రికార్డు సాధ్యమైంది. అవినీతిపై ఏమాత్రం రాజీ లేకుండా మరింత వేగంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తులు కొనసాగించాలని అన్ని యూనిట్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. నిజాయితీ, ప్రజాసేవే ఏసీబీ ప్రధాన లక్ష్యం. అవినీతి నిర్మూలన కోసం ఇదే దూకుడు కొనసాగిస్తాం' అని అన్నారు.

తెలంగాణ టీవీ అవార్డులకు పీవీ పేరు?..

మంత్రి కోమటిరెడ్డి కీలక ప్రకటన

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 28:

తెలంగాణలో టెలివిజన్ రంగానికి ప్రత్యేక గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుల్లితెర కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేలా టెలివిజన్ అవార్డులను ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతమైంది. ఈ అవార్డులకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

వెల్లడించారు.టెలివిజన్ అవార్డు కమిటీ ప్రతినిధులతో మంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అవార్డుల లోగో, కేటగిరీలు, పేరుపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మను ప్రతిబింబించేలా లోగో, పేరు ఉండాలని మంత్రి సూచించారు.తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరును అవార్డులకు పెట్టే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు.

'అత్యంత నీచమైన వ్యక్తి'..

కొత్త విద్యాశాఖ మంత్రిపై రాహుల్ గాంధీ ఫైర్

ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, జూలై 28:

నూతన కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై మంగళవారం ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. 'అత్యంత నీచమైన వ్యక్తి' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తిని విద్యాశాఖ మంత్రిగా నియమించడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు.. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ బాధ్యతలు అప్పగించిన నిర్ణయాన్ని ప్రశ్నించారు.

"దేశంలో యువత విద్యా వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేస్తోంది. ఎంతో మంది విద్యార్థినులు ఆందోళనల్లో పాల్గొన్నారు. వారిపై దాడులు జరిగాయి. అలాంటి సమయంలో అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తిని బీజేపీ విద్యాశాఖ మంత్రిగా నియమించింది. అలాంటి వ్యక్తి కంటే నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. అత్యాచార నిందితులకు రక్షణ కల్పించాలనే వ్యక్తే ఇప్పుడు భారత విద్యాశాఖ మంత్రి" అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

భార్యకు ఉరేసి.. ఆమె తల్లిదండ్రులకు వీడియో కాల్..

ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, జూలై 28:

కర్ణాటకలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో ఘాతుకానికి ఒడిగట్టాడు. వివాహేతర సంబంధం కొనసాగిస్తోందన్న అనుమానంతో ఆమెకు ఉరి వేశాడు. భార్య తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి.. ఉరికి వేలాడుతూ ప్రాణం కోసం పోరాడుతున్న ఆమెను లైవ్‌లో వారికి చూపించాడు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బాగల్‌కోట్ జిల్లా, గలగాలి గ్రామానికి చెందిన ప్రవీణ్ జిగలూర్, భాగ్యశ్రీ జిగలూర్ భార్యాభర్తలు. భార్య వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుందని ప్రవీణ్ అనుమానం పెంచుకున్నాడు. గత కొన్ని నెలలనుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ గొడవల కారణంగా భాగ్యశ్రీ భర్తతో ఉండలేకపోయింది. రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రవీణ్ భార్యకు తరచుగా ఫోన్ చేసి ఇంటికి రమ్మని బతిమలాడటం మొదలెట్టాడు. భర్త అంతగా బతిమలాడుతుంటే ఆమె కాదన లేకపోయింది. ఆదివారం పుట్టింటినుంచి భర్త దగ్గరకు వచ్చింది. భాగ్యశ్రీ ఇంటికి వచ్చిన కొన్ని గంటలకే భార్యాభర్తల మధ్య గొడవ మొదలైంది. గొడవ చిలికి చిలికి గాలివానలా మారింది.ప్రవీణ్ భార్యను కర్రతో చితకబాదాడు. తర్వాత ఆమెకు దుపట్టాతో ఉరి వేశాడు. భాగ్యశ్రీ తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి.. ఉరికి వేలాడుతూ ప్రాణాల కోసం పోరాడుతున్న ఆమెను లైవ్‌లో చూపించాడు. భాగ్యశ్రీ తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ప్రవీణ్ ఇంటి దగ్గరకు వెళ్లారు. అప్పటికే ఆమె చనిపోయింది. పోలీసులు భాగ్యశ్రీ శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని



దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

యాంటీ-పేపర్ లీక్ బిల్లు భారత పార్లమెంట్ చరిత్ర నిలిచిపోతుంది: జితేంద్ర సింగ్

ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, జూలై 28: తమ ప్రభుత్వం తీసుకువచ్చిన యాంటీ-పేపర్ లీక్ బిల్లు భారత పార్లమెంట్ చరిత్రలో నిలిచిపోతుందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. విద్యార్థులు, యువత పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ బిల్లు నిదర్శనం అన్నారు. యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై మంగళవారం లోక్ సభలో చర్చ జరిగింది. ఈ చర్చ సందర్భంగా మాట్లాడిన జితేంద్ర సింగ్.. యూపీఏ హయాంలో ఎన్నోసార్లు పేపర్ లీకేజీలు జరిగాయని 2012లో ఎయిమ్స్ ఎంట్రన్స్ పేపర్ లీకేజీ జరిగిందన్నారు. 2010లో యూపీలో బీఈడీ పేపర్ లీకేజీ, గతంలో తమిళనాడులో పీఎస్సీ పేపర్ లీకేజీ జరిగిందని గుర్తు చేశారు. ఎన్నో ఎంట్రన్స్, పరీక్షలు, ఉద్యోగ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని పేపర్ లీకేజీలు క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని అన్నారు.

నేను పారిపోలేదు.. ఊళ్లోనే ఉన్నా

- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 28: హైదరాబాద్ జాతీయ పోలీస్ అకాడమీలో సంచలనం సృష్టించిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, తాను ఎక్కడికీ పారిపోలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం తన సొంత ఊరు ఊళ్లపాలెంలోనే ఉన్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఉదయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చట్టంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, పోలీసుల విచారణకు సంపూర్ణంగా సహకరిస్తానని చెప్పారు. తన నాన్నమ్మకు ఆరోగ్యం బాగోలేకపోవడంతోనే సొంతూరుకు వచ్చినట్లు వివరించారు. పోలీసులు వెతికినవి తన తాత్కాలిక చిరునామాలు అని పేర్కొన్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున దీనిపై ఎక్కువగా మాట్లాడలేనని అన్నారు. త్వరలోనే విచారణ అధికారులను కలిసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానని ధీమా వ్యక్తం చేశారు.

ఫేస్‌బుక్‌లో మోదీ వీడియో తొలగింపు..

సారీ చెప్పిన మెటా

ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, జూలై 28: ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్‌లో కొద్దిసేపు నిలిపివేసిన ఘటనపై కేంద్ర ప్రభుత్వానికి మెటా క్షమాపణ చెప్పింది. ఇది ఉద్దేశపూర్వకంగా జరగలేదని, సాంకేతిక లోపం వల్లేనని వివరణ ఇచ్చింది. పొరపాటు గుర్తించిన వెంటనే వీడియోను పునరుద్ధరించినట్లు మెటా ప్రతినిధి వెల్లడించారు.జులై 23న అప్‌లోడ్ చేసిన ఈ వీడియోలో విద్యార్థుల నిరసనల సందర్భంగా జనరేషన్ జెడ్‌ను ఉద్దేశించి మోదీ సందేశం ఇచ్చారు. పరీక్షల ప్రశ్నపత్రాల లీకేలను అరికట్టేందుకు కఠిన చర్యలు ప్రకటిస్తామని అందులో పేర్కొన్నారు. అయితే కొద్దిసేపు ఈ వీడియోను తెరవడానికి ప్రయత్నించిన వినియోగదారులకు 'చట్టపరమైన అభ్యర్థన మేరకు ఈ ప్రాంతంలో వీడియోను నిలిపివేశాం' అనే సందేశం కనిపించింది. అనంతరం వీడియోను తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చారు.



జపాన్‌లో 7.1తీవ్రతతో భూకంపం..

సునామీ హెచ్చరికలు జారీ..

ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, జూలై 28: జపాన్ దక్షిణ ప్రాంతంలో భారీ భూకంపం వచ్చింది. క్యూషులోని కుమమోటో ప్రిఫెక్చర్‌లో మంగళవారం 7.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. భూకంప కేంద్రం సముద్ర మట్టానికి 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. భూకంపం కారణంగా పలువురు గాయపడగా, ఒక భవనం కూలిపోయినట్లు ప్రధాని సనాయే తకైచి తెలిపారు.భూకంపం తర్వాత జపాన్ సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ఒక మీటర్ ఎత్తు వరకు అలలు వచ్చే అవకాశం ఉందని అధికారులు ప్రజల్ని అప్రమత్తం చేశారు.

రాహుల్ గాంధీ ధర్నాతో సీజేపీ ఉద్యమం పీక్స్‌కు: మంత్రి శ్రీధర్ బాబు

ఇయ్యాల్టి న్యూస్,హైదరాబాద్, జూలై 28: యువకుడిలా ఆలోచించే శక్తి సీఎం రేవంత్ దగ్గర ఉందని, జెన్ జీ తో పోటీ పడే ఆలోచన ముఖ్యమంత్రిదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మా యూత్ కాంగ్రెస్ నేతల్లో 90 శాతం జెన్ జీలే ఉన్నారని చెప్పారు. మంగళవారం మీడియాతో చిట్?చాట్?లో మాట్లాడిన ఆయన.. విద్యార్థుల నిరసన కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. నీట్ అనేది కోట్లాది విద్యార్థులు సమస్య అని, మధ్య తరగతి కుటుంబాలు సైతం ఈ నిరసనలో పాల్గొన్నారని చెప్పారు. కాక్రోచ్ పార్టీ ఆన్?లైన్ ఉద్యమం మొదలు పెట్టిందని ఆ పార్టీ నినాదాన్ని బలంగా తీసుకెళ్లింది రాహుల్ గాంధీ అని చెప్పారు. నిరసన ఉద్యమం విస్తరించడానికి కారణం కాంగ్రెస్ అని, రాహుల్ గాంధీ ప్రధాని ఇంటి ముందు ధర్నా చేయడంతో ఉద్యమం పీక్స్ కి వెళ్ళిందన్నారు.

పీఓకేలో పాక్ సైన్యం అరాచకం..

కాల్పుల్లో 20 మంది ఉద్యమకారులు మృతి..

ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, జూలై 28:

పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే) నిరసనల్ని ఉక్కుపాదంతో అణచివేసేందుకు పాకిస్తాన్ సైన్యం దారుణాలకు ఒడిగడుతోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజలను కాల్చి పారేస్తోంది. గత 24 గంటల్లో కనీసం 20 మంది ఈ కాల్పుల్లో మరణించగా, 50 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తోంది. రావలకోట్ డ్రేక్ ఎయిత్ ప్రాంతంలో భద్రతా బలగాలు నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని పాక్ సైన్యం కాల్పులకు తెగబడింది. ఉద్యమానికి సారధ్యం వహిస్తున్న జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ప్రతినిధి ఉమర్ నజీర్ కశ్మీరీ సోదరుడు ఉస్మాన్ నజీర్ కూడా మృతుల్లో ఉన్నట్లు వర్గాలు తెలిపాయి.జూన్ 5 నుంచి పీఓకేలో ఎన్నికలకు, రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రారంభమైంది. ఇప్పటి వరకు పాకిస్తాన్ బలగాల కాల్పుల్లో 80 మంది మరణించిట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవతున్న వీడియోల్లో రోడ్లపై మృతదేహాలు కనిపిస్తున్నాయి.



సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు పార్లమెంటరీ ప్యానెల్?

సమన్లు- ఆగస్టు 3న హాజరవ్వాలని ఆదేశం

ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, జూలై 28:

సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నియంత్రణపై చర్చించేందుకు, ఇన్‌స్టాగ్రామ్‌తో సహా ప్రధాన సామాజిక మాధ్యమాల ప్రతినిధులకు పార్లమెంటరీ ప్యానెల్? మంగళవారం సమన్లు జారీ చేసింది. వీరితో పాటు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హోం శాఖల అధికారులను ఆగస్టు 3న హాజరు కావాలని ఆదేశించింది. ఈ మేరకు కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి అధ్యక్షత వహిస్తున్న బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే వెల్లడించారు.

కేంద్రమంత్రి భగీరథ్ చౌదరి కీలక నిర్ణయం..

పార్లమెంట్‌లో సంచలన ప్రకటన

ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, జూలై 28:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో కీలక సమాచారం వెల్లడించింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి తన సొంత వ్యవసాయ క్షేత్రం కోసం ఉద్యానవన పథకం కింద పొందిన రూ.99 లక్షల సబ్సిడీని తిరిగి చెల్లించినట్లు తెలిపింది. వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని వెల్లడించారు. భగీరథ్ చౌదరి సంబంధిత బ్యాంకుకు సబ్సిడీ మొత్తాన్ని తిరిగి చెల్లించారని, ఆ మొత్తాన్ని జాతీయ ఉద్యానవన బోర్డుకు బదిలీ చేయాలని బ్యాంకుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

నేర చరిత్ర లేని వారిపై చర్యలు వద్దు..

విద్యార్థుల ఆందోళనలపై సుప్రీం కీలక ఆదేశాలు

ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, జూలై 28: నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా పోలీసుల బలప్రయోగం, పోలీసులపై జరిగిన దాడులపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అలాగే నేర చరిత్ర లేని విద్యార్థి నిరసనకారులపై తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిటిషనర్ల ఆరోపణలు ప్రాథమికంగా స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు అవసరాన్ని సూచిస్తున్నాయని పేర్కొంది.

ట్రెండింగ్, క్రైం
ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

సీనియర్ సినీ నటి పావలా శ్యామల కన్నుమూత

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 28:
ప్రముఖ సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.గత అర్ధరాత్రి దాటాక తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఉస్మానియాఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాలలో నటించారు. 1985లో వచ్చిన 'బాబాయ్ అబ్బాయ్' చిత్రంతో వెండితెరకు పరిచయమైనప్పటికీ, కె. విశ్వనాథ్ దర్శకత్వంలోని 'స్వర్ణకమలం' సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత 'ఖడ్గం', 'ఆంధ్రావాలా', 'అతడు', 'గోలీమార్' వంటి అనేక విజయవంతమైన చిత్రాల్లో తనదైన సహజ నటనతో, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించారు.ఏపీలోని గుంటూరు జిల్లా అమరావతిలో 1951లో జన్మించిన శ్యామల అసలు పేరు నేతి శ్యామల. నటనపై ఆసక్తితో తొలుత రంగస్థల నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు. ఆమె నటించిన 'పావలా' అనే నాటకం విశేష ప్రజాదరణ పొందడంతో అదే ఆమె ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. తన అమాయకత్వంతో కూడిన నటనతో తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేశారు. ఆమె మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది.

అందాలతో మతి పోగొడుతున్న రాశి ఖన్నా.. బ్లాక్ డ్రెస్‌లో స్టన్నింగ్ ఫోటోలు..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 28:
హీరోయిన్ రాశిఖన్నా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. లేటెస్టుగా ఆమె బ్లాక్ డ్రెస్ షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి...

ఐశ్వర్య రాజేష్ సొగసు.. క్రేజీ ఫోజులకు నెటిజన్లు ఫిదా

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 28:
ఐశ్వర్య రాజేష్ అద్భుతమైన లుక్స్‌తో మెరిసిపోతోంది. ఆమె చూపుతున్న సోయగం అభిమానులను కట్టిపడేస్తోంది. నేచురల్ బ్యూటీగా పేరున్న ఐశ్వర్య, ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో తన గ్రేస్, స్టైల్‌తో సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది.

నోటి దురుసు.. పెండ్లాం పాయె.. ప్రాణం పాయె!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 28:
ఏపీ బాపట్ల జిల్లా సంతరావూరులో ఘోరం జరిగింది భాయి. శ్రీనివాసరావు అనే గొర్రెల కాపరి, తన పెండ్లాం నాగలక్ష్మి ఇంట్లకెళ్ళి

పోవడానికి పక్కింటి వెంకటనారాయణే కారణమని అనుమానం పెంచుకున్నాడు. వాడు, వాని దోస్తులు ఎప్పుడు కన్పించినా గట్టిగా తిట్టేటోడు. ఊర్లో తమ పరువు పోతుందని కసి పెంచుకున్న వెంకటనారాయణ, సుబ్రహ్మణ్యం, బలరామ్‌లు కలిసి రాత్రి పొలంలో పడుకున్న శ్రీనివాసరావును కర్రలతో కొట్టి చంపేశారు. పోలీస్ కుక్క నేరుగా వెంకటనారాయణ ఇంటికే వెళ్లడంతో ముగ్గురు దొరికిపోయారు. పోలీసులను అరెస్ట్ చేసి జైలుకు పంపించారు.

ఎద అందాలతో.. సెగలు పుట్టిస్తున్న హాట్ బ్యూటీ..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 28:
ప్రియాంక జవాల్కర్ ఎద అందాలతో సెగలు పుట్టిస్తున్న ఫొటోలను నెట్టింట షేర్ చేశారు. మోడ్రన్ డ్రెస్‌లో ఉన్న ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోరగాళ్లు ఆమె అందానికి ఫ్లాట్ అవుతున్నారు.

అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమైన అల్లు అర్జున్.. ఫ్యాన్స్‌కు కీలక సూచన!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 28: పాన్ ఇండియా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హైదరాబాద్‌లో తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యూసుఫ్‌గూడలోని శౌర్య భవన్‌లో 'అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 600 మందికి పైగా అభిమానులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన బన్నీ... సోషల్ మీడియాలో వ్యక్తమయ్యే అనవసరపు ట్రోల్స్, నెగెటివిటీపై పరోక్షంగా స్పందించారు. నెట్టింట సాగే దుష్ప్రచారాలను, వివాదాలను అస్సలు పట్టించుకోవద్దని అభిమానులకు హితవు పలికారు. సానుకూల ధోరణితో ముందుకెళుతూ, తమ సమయాన్ని, శక్తిని మంచి కార్యాలకే వినియోగించాలని పిలుపునిచ్చారు.అభిమానులు చూపుతున్న అమితమైన ఆప్యాయతకు బన్నీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారితో కలిసి గ్రూప్ ఫోటోలు దిగుతూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. నెగెటివిటీకి దూరంగా ఉండాలని అల్లు అర్జున్ ఇచ్చిన సందేశానికి సోషల్ మీడియాలోనూ ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సమావేశంతో అభిమానులకు, ఐకాన్ స్టార్‌కు మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడింది.

కదులుతున్న రైలు ఏసీ కోచ్‌లో దీపం వెలిగించి ప్రయాణికుడి పూజలు.. వైరల్ వీడియోతో వెలుగులోకి ఘటన!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 28:
కదులుతున్న రైలులో ఓ ప్రయాణికుడు చేసిన నిర్వాకం తీవ్ర దుమారం రేపుతోంది. వందలాది మంది ప్రయాణికుల భద్రతను గాలికి వదిలేసి, ఏసీ కోచ్‌లోనే దీపం, అగరుబత్తీలు వెలిగించి పూజలు చేయడం తీవ్ర వివాదాస్పదంగా మారింది.

ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తిగత విశ్వాసాలు ముఖ్యమే అయినప్పటికీ, సాటి ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టడం నేరమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వివరాల్లోకి వెళితే.. ఓ కదులుతున్న రైల్లోని ఎయిర్ కండిషన్డ్ (ఏసీ) కోచ్‌లో, పై బెర్త్‌పై కూర్చున్న ఓ వ్యక్తి నూనె దీపం, అగరుబత్తీలు వెలిగించి పూజలు చేయడం ప్రారంభించాడు. కొద్దిసేపటికే బోగీ మొత్తం పొగతో నిండిపోవడంతో ఇది గమనించిన తోటి ప్రయాణికుడు అప్రమత్తమయ్యాడు. వెంటనే అతడి వద్దకు వెళ్లి, కదులుతున్న రైల్లో నిప్పు వెలిగించడం ఎంత ప్రమాదకరమో వివరించి, వెంటనే ఆర్పేయాలని సూచించాడు. ఈ ఘటనను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది క్షణాల్లో వైరల్ అయింది.



ఇంత కరువు పట్టి ఉన్నారేంట్రా.. స్తంభాలకున్న కరెంట్ తీగలనూ వదల్లేదు..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 28: అడిగేవాడు లేకపోతే అందినకాడికి దోచుకెళ్ళారట.. అలాగుంది ఆ కాలనీలో పరిస్థితి.. వెలిగొండ ప్రాజెక్టు పునరావాస కాలనీలో ఇళ్ళు నిర్మించుకునేందుకు అవసరమైన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారే కానీ, వాటి పర్యవేక్షణ, రక్షణ అధికారులు గాలికొదిలేశారు. ఫలితంగా 17 విద్యుత్ స్తంభాలను అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను కట్ చేసి మరీ ఎత్తుకెళ్ళారు దొంగలు. వాటిని అమ్మి సొమ్ము చేసుకునేందుకు గుట్టుచప్పుడు కాకుండా పక్కా ప్లాన్‌తో పనికానిచ్చేశారు. పునరావాస కాలనీలో జనసంచారం ఎక్కువగా లేకపోవడంతో తీరిగ్గా విద్యుత్ స్తంభాలను ఎక్కిమరీ తీగలను కట్ చేసి ఎత్తుకెళ్ళారు.మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలం తోకపల్లి దగ్గర వెలిగొండ ప్రాజెక్ట్ సుంకేసుల గ్రామ పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. గత కొంతకాలంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు విద్యుత్ స్తంభాలు పాతి కరెంట్ వైర్లు ఏర్పాటు చేశారు. అయితే



దొంగల కళ్ళు వీటిపై పడింది. పునరావాస కాలనీలో జనసంచారం లేకపోవడంతో ఏకంగా 17 విద్యుత్ స్తంభాలపై ఉన్న విలువైన తీగలను దొంగలు ఎత్తుకెళ్ళారు. దొంగలు రాత్రి సమయంలో స్తంభాలపై ఉన్న విద్యుత్ తీగలను కట్ చేసుకొని తీసుకుని పోయి ఉంటారని భావిస్తున్నారు. కాలనీలో అధికారుల పర్యవేక్షణ లేకుండా పోవడంతో ఇప్పటికే నిర్మించిన ప్రభుత్వ భవనాల తలుపులను కూడా దుండగులు ధ్వంసం చేస్తున్నారు.ఇటీవల కాలంలో పెద్దారవీడు మండలం లోని అనేక గ్రామాలలో వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్ ఫారాలను ధ్వంసం చేసి అందులోని ఖరీదైన తీగలను దొంగలు దోచుకెళుతున్నారు. విద్యుత్ తీగల చోరీకి పాల్పడుతున్న దుండగుల తీరుతో రైతులు ఇప్పటికే ఇబ్బందులు పడుతుండగా.. తాజాగా సుంకేశుల పునరావాస కాలనీలో స్తంభాలపై ఏర్పాటుచేసిన విద్యుత్ వైర్లను కట్ చేసి మరీ ఎత్తుకెళ్ళడం విద్యుత్ శాఖ అధికారుల లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు దీనిపై స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

పెళ్లి చేస్కోమంటే బైక్‌తో లాక్కెళ్లాడురా భాయ్!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 28: బీహార్‌లోని నలందాలో ఓ అరాచకం జరిగింది ఉస్తాద్. ఐదెండ్లకెళ్ళి లవ్ చేస్తున్న పిల్ల "పెళ్లి చేస్కోరా బాబు" అని అడిగినందుకు, ఓ లఫంగి గాడు ఆమెను బైక్‌కి ఈడ్చుకుంటూ ఏకంగా 100 మీటర్లు పోయాడు. రాజగిర్‌లో జరిగిన ఈ సీన్ వైరల్ కావడంతో జనాలు షాక్ అయ్యారు.

నర్దిగంజ్‌లో గవర్నమెంట్ అమీన్ ఉద్యోగం చేస్తున్న ఆ పోరడు అక్కడికెళ్ళినప్పుడు పిల్లకు, వానికి గొడవైంది. వాడు బైక్ స్టార్ట్ చేసి పారిపోతుంటే, పిల్ల ఆపాలని పట్టుకుంది. వాడు ఆపకుండా స్పీడ్ పెంచడంతో రోడ్డు పైనీడికి లాక్కెళ్లాడు. ఆ తర్వాత బైక్ కిందపడటంతో లోకల్ జనాలు వానికి గట్టిగా సర్వీస్ చేసి, పోలీసులకు అప్పజెప్పారు. పాపం, ఆ పిల్లకు తీవ్ర గాయాలు అయ్యాయి.

ON BEHALFOF RRR MEDIA PRIVATE LIMITED. 2-3-603/49A, PATELNAGAR, AMBERPET, HYDERABAD.TELNGANA 500013..
EDITOR:RAMAN RAJU RATHNA.RNI NO:TG/2024/1093, Email:ramannews9@gmail.com Phone:9949152838,7013794396